క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్, హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 5న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్, హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వరంగల్‌లోని హంటర్ రోడ్డు బొందివాగు, రామా టాకీస్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, హనుమకొండలోని కొత్త బస్‌స్టేషన్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, టీచర్స్ కాలనీ, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 వరకు, సోమిడి వ్యవసాయ ఫీడర్, టేకులగూడెం ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు, మడికొండ టెక్స్‌టైల్స్ పార్కు ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి గోవిందరాజుల బ్రహ్మోత్సవాలు



వరంగల్ చౌరస్తా: ఈనెల 5 నుంచి 26వ తేదీ వరకు గోవిందరాజుల స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మిట్టపల్లి భాస్కర్, నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు గుట్ట వద్ద బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజ్, మీసాల ప్రకాష్, స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, సునీల్, బాషపాక సదానందం, కొమ్ము రాజకుమార్, తదితరులు శుక్రవారం ఆవిష్కరించారు.

హసన్‌పర్తి ఏఈగా శిరీష్



హసన్‌పర్తి: హసన్‌పర్తి విద్యుత్ ఏఈగా శిరీష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఏఈగా విధులు నిర్వహించిన మౌనిక సెలవుపై వెళ్లారు. భీమదేవరపల్లి కొత్తకొండ సబ్‌స్టేషన్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న శిరీష్‌ను హసన్‌పర్తికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన శిరీష్‌ను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ స్వామినాయక్, సిబ్బంది రౌతు రమేష్ కుమార్, రామ్మోహన్, హనుమాన్ నాయక్, రవీందర్, రాజమౌళి, కుమార్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, చంద్రమూర్తి, మహ్మద్ వాజీద్, రాజు, కిషన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌కు అభినందనలు



కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ రెహమాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమేరకు ఆయనకు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్, కుక్టా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్ లోథ్, అధ్యాపకులు డాక్టర్ ఆదిరెడ్డి, డాక్టర్ హరికృష్ణ, ఏ.రాజ్‌కుమార్, తదితరులు అభినందనలు తెలిపారు.

‘డ్రంకెన్ డ్రైవ్’లో జరిమానా

రామన్నపేట: మద్యం తాగి వాహనం నడిపిన 23 మందికి రూ.25,800 జరిమానా విధిస్తూ వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జస్టిస్ అబ్బోజు వెంకటేశం శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన రాయపురం సాయికుమార్‌కు ఎంజీఎం సమీపంలోని వెటర్నరీ ఆస్పత్రిలో రెండు రోజుల పాటు సామాజిక సేవ చేయాలని శిక్షలో పేర్కొన్నారని చెప్పారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఇద్దరు వాహనదారులకు రూ.1300 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. ఐదుగురు మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడగా జువైనల్ మెజిస్ట్రేట్ వారికి ఒకరోజు బాలల అబ్జర్వేషన్ హోమ్‌కు తరలించాలని పేర్కొన్నట్లు తెలిపారు.

ఆరుగురికి జైలు..

కాజీపేట / వరంగల్ క్రైం: కాజీపేట పట్టణంలో ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన 21 మందిలో ఆరుగురికి రెండు రోజులు జైలు శిక్ష, 15 మందికి రూ.23,200ల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఫాతిమా చిన్నప్ప తీర్పునిచ్చారు. స్థానిక ట్రాఫిక్ సీఐ నాగబాబు కథనం ప్రకారం కాజీపేట పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ సిబ్బందికి 21 మంది పట్టుబడ్డారు. తురాయి బాలు, మ్యాక రాజు, కుంచం జంపన్న, చామళ్ల రవీందర్, నక్క చంద్రశేఖర్, ఎకరా మూతలయ్యకు రెండు రోజుల జైలు శిక్షను న్యాయమూర్తి ఖరారు చేయగా, వారిని పరకాల సబ్‌జైలుకు పంపించినట్లు సీఐ వివరించారు. మద్యం తాగి నడపడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

సన్నబియ్యం కోసం ఎదురుచూపులు

- ‘తూర్పు’లో రేషన్ షాపుల ఎదుట లబ్ధిదారుల పడిగాపులు
- మంత్రి సురేఖ ప్రారంభించాలని అధికారుల తాత్సారం
- నోరెత్తని కార్పొరేటర్లు, పార్టీ నాయకులు

వరంగల్: ‘దేవుడు వరమిచ్చినా.. పూజారి వరమివ్వలేదు’ అన్న చందంగా తయారైంది వరంగల్ తూర్పు నియోజకవర్గ ప్రజల పరిస్థితి. ఉగాది పండుగకు సన్నబియ్యం అందిస్తున్నట్లు రాష్ట్రవ్యాప్తంగా భారీగా ప్రచారం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ.. గత నెల 29వ తేదీన నల్గొండ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉగాది నుంచి అన్ని నియోజకవర్గాల్లో ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలతో పాటు ఇతర ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని ఆదేశాలున్నాయి. దాంతో అంతటా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. అయితే, వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వరంగల్, ఖిలా వరంగల్ మండలాల ప్రజలకు మాత్రం గ్రహణం పట్టుకుంది. రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రిగా కొండా సురేఖ అధికార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నట్లు సమాచారం. ఆమె వస్తేనే కార్యక్రమం ప్రారంభమవుతుందని పలువురు చెబుతున్నారు.



తూర్పులోని ఓ రేషన్‌షాపు ఎదుట బియ్యం కోసం వేచి చూస్తున్న మహిళలు

ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్, మరునాడు మంగళవారం కూడా ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో ఏప్రిల్ 2వ తేదీ నుంచి పంపిణీ ప్రక్రియ ప్రారంభం అవుతుందని అధికారులు తెలిపారు. కానీ ప్రారంభం కాలేదు.

రేషన్ షాపుల ఎదుట బారులు

ఉగాది పండుగ రోజు మంత్రి కొండా సురేఖ స్థానికంగా ఉన్నప్పటికీ ఆమెతో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు చేయించలేకపోయారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో నాయకులు పథకాన్ని ప్రారంభించారని, ప్రజలు సన్నబియ్యం తీసుకుంటున్నారన్న సమాచారం సోషల్ మీడియాల్లో రావడంతో తూర్పులోని లబ్ధిదారులు రేషన్‌షాపుల ఎదుట క్యూ కడుతున్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇవ్వడంతో ఆలస్యంగానైనా, ఎప్పుడో ఒకసారి వచ్చి తీసుకుపోయేవారు. ఇప్పుడు సన్నబియ్యం ఇస్తుండడంతో స్టాక్ ఉంటుందో లేదో అన్న ఆతృతతో షాపుల ఎదుట ఉదయం 8గంటలకే వచ్చి లైన్ కడుతున్నారు. ఈరోజు కూడా బియ్యం ఇవ్వడం లేదని సదరు రేషన్‌షాపుల డీలర్లు చెప్పడంతో నిరాశతో వెనుదిరిగి వెళ్తున్నారు. సన్నబియ్యం పంపిణీ ప్రారంభమై వారం గడుస్తున్నా ఇక్కడ ఇవ్వడం లేదని తూర్పులోని లబ్ధిదారులు అంటున్నారు. ఈవిషయంపై సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే ఏం చెప్పాలో తెలియక సతమతమవుతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ చొరవ తీసుకుని స్థానిక నేతల సమక్షంలో సన్నబియ్యం పంపిణీ చేయాలన్న డిమాండ్ స్థానికంగా వినిపిస్తోంది.

వస్తున్నాం.. పోతున్నాం..



సన్నబియ్యం ఇస్తారేమోనని రోజూ రేషన్ దుకాణం వద్దకు వస్తున్నా. ఇవ్వడం లేదని తెలిసి నిరాశతో వెళ్లిపోతున్నా. ఎప్పుడు ఇస్తారని అడితే ఇంకా అధికారులు ఆదేశాలు ఇవ్వలేదని రేషన్ డీలర్ చెబుతున్నాడు. పాలకులు, అధికారులు స్పందించి వెంటనే సన్న బియ్యం ఇవ్వాలి.

\- లక్ష్మీనారాయణ, ఎల్‌బీనగర్

పేదలందరికి సన్నబియ్యం పంపిణీ

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

రామన్నపేట: రేషన్‌కార్డు ఉన్న పేదలందరికి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు 29వ డివిజన్‌లో నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా రేషన్ కార్డుదారులకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. తాము తీసుకొచ్చిన సన్న బియ్యం పథకం చరిత్రలో నిలిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఓరుగంటి పూర్ణ, మాజీ కార్పొరేటర్ బుద్ద జగన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాయిని

జీవ వైవిధ్యాన్ని ధ్వంసం చేస్తున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్

హన్మకొండ: జీవ వైవిధ్యాన్ని ధ్వంసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన అటవీ ప్రాంతంలోని వృక్షాలను తొలగించడం, అందులో ఆవాసం ఏర్పరుచుకున్న మూగ జీవులకు రక్షణ లేకుండా చేయడం, నీటి వనరులను ధ్వంసం చేయడంపై శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ వేత్త పిట్టల రవిబాబు మాట్లాడుతూ షెడ్యూల్ 1, 2, 3, 4 జాబితాలోని జీవులను మట్టుబెట్టడం అత్యంత దారుణమన్నారు. పర్యావరణవేత్త రతన్ సింగ్ మాట్లాడుతూ పరిమిత వనరులైన నీరు, భూమి, ఖనిజాలు, చెట్లను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలన్నారు. బీజేపీ నేత, మాజీ మేయర్ టి.రాజేశ్వరరావు మాట్లాడుతూ మనిషి తన స్వార్థం కోసం ప్రకృతిని నాశనం చేయడం దారుణమని వాపోయారు. కార్యక్రమంలో పర్యావరణవేత్త నిఖిత, అరవింద్ ఆర్య, పరికిపండ్ల వేణు, శ్యామ్, కమలాకర్ స్వామి, విద్యార్థి నాయకులు శరత్, రాకేష్ యాదవ్, బైరపాక ప్రశాంత్, శ్రీకాంత్ చారి, వీరస్వామి, అనిల్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలి

హన్మకొండ: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గతనెల 23న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కరీంనగర్ నుంచి చేపట్టిన బస్సు యాత్ర రాష్ట్రంలోని 119 నియోజక వర్గాల పర్యటనలో భాగంగా శుక్రవారం హనుమకొండకు చేరుకుంది. ముందుగా హనుమకొండలోని కాళోజీ విగ్రహానికి ఫోరం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కడి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చీమ శ్రీనివాస్ మాట్లాడుతూ డిమాండ్ల సాధనకు ఈనెల 21న సికింద్రాబాద్‌లో నిర్వహించనున్న ఉద్యమకారుల ప్లీనరీకి తెలంగాణ ఉద్యమకారులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, సీనియర్ న్యాయవాది వొడపల్లి శ్యామ్‌కృష్ణ, వరంగల్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, న్యాయవాది అనుముల రమేష్, ఉద్యమకారులు బాల్నే శ్రీనివాస్, కొంగరి రాజు, రాజేంద్రప్రసాద్, ఎండీ.రఫీ, జమ్మల నాగరాజు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు, ఉద్యమకారులు

బియ్యం పంపిణీ నిలిపివేత సరికాదు

వరంగల్: రాష్ట్రంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నా.. తూర్పు నియోజకవర్గంలో నేతల వల్ల ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయకపోవడం సరికాదని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సన్నబియ్యం ఇస్తారన్న ఆశతో ప్రజలు రోజూ రేషన్ షాపుల వద్దకు వచ్చి ఎండలో ఇబ్బంది పడుతూ ఇవ్వడం లేదని తెలిసి నిరాశతో వెళ్లిపోతున్నారని తెలిపారు. అధికారులను ప్రశ్నిస్తే ఏమీ తెలియనట్లు మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. మంత్రి కొండా సురేఖ అందుబాటులో లేకపోవడం వల్లనే పంపిణీ ఆలస్యానికి కారణం అని తెలిసిందన్నారు.

కోటను సందర్శించిన సీపీ



ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన ఖిలా వరంగల్ కోటను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ శుక్రవారం సాయంత్రం తన కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా శిల్పాల ప్రాంగణంలోని శిల్పకళా సంపదను తిలకించారు. అనంతరం ఏకశిల గుట్ట, ఖుష్‌మహల్‌ను వీక్షించారు. అనంతరం, టీజీటీడీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాకతీయుల చరిత్రను వివరించే సౌండ్ అండ్ లైటింగ్ షోను ఆసక్తిగా తిలకించారు. కాకతీయుల విశిష్టతను సీపీకి కోట గైడ్ రవియాదవ్ వివరించారు. సన్‌ప్రీత్‌సింగ్‌కు కేంద్ర పురావస్తు శాఖ జేఎస్‌ఏ విజయ్‌కుమార్ కాకతీయుల తోరణం మెమోంటోను అందజేసి సన్మానించారు. సీపీ వెంట ఏసీపీ నందిరాంనాయక్, ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం, ఎస్సైలు సురేష్, శ్రీకాంత్, టీఎస్‌టీడీసీ కోట ఇన్‌చార్జ్ అజయ్, తదితరులు ఉన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి



ప్రసంగిస్తున్న విజయానంద తీర్థ

ఖిలా వరంగల్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం అందరిపై ఉందని మైసూర్ దత్తపీఠం ఉత్తరాధికారి విజయానంద తీర్థస్వామిజీ సూచించారు. పుష్కరకాల కుంభాభిషేకం మహోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రామలింగేశ్వర స్వామి, లలితాదేవి, పంచముఖాంజనేయ స్వామి, గణపతి, రామాలయ శిఖరాల అభిషేక కార్యక్రమాలను శుక్రవారం నేత్రపర్వంగా నిర్వహించారు. నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి శిఖరాభిషేకాన్ని విజయానంద తీర్థ స్వామిజీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వడ్నాల మల్లయ్య, మంచాల కృష్ణమూర్తి, చింతం యాదగిరి, శ్రీరాం రాజేష్, బత్తుల నవీన్, బుదారపు భాస్కర్, ఆడెపు సాంబమూర్తి, కుడికాల సుధాకర్, రాజమౌళి, నరసింహమూర్తి, దశరథం, భిక్షపతి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



ఇళ్ల వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను అర్హులైన పేదలకు ఇవ్వాలని సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు వలదాసు దుర్గయ్య డిమాండ్ చేశారు. వరంగల్ 43వ డివిజన్ తిమ్మాపురం రోడ్డులోని లక్ష్మీపురంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను నాయకులతో కలిసి శుక్రవారం సందర్శించి ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లను అర్హులైన నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సాంబమూర్తి, మంజుల, ఉదయశ్రీ, స్వాతి, రజియా, రజిని, షమీనా, మల్లయ్య, ప్రకాశ్, కృష్ణ, బద్రి, తదితరులు పాల్గొన్నారు.

సేవలు మాత్రమే గుర్తుంటాయి

వరంగల్: ఉద్యోగ విరమణ పొందినప్పటికీ విద్యార్థులకు అందించిన సేవలు మాత్రమే ఎప్పుడూ గుర్తుంటాయని శుక్రవారం విరమణ పొందిన పైడిపల్లిలోని ప్రభుత్వ మండల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నేరెళ్ల రవీందర్ అన్నారు. ఈ సందర్భంగా రవీందర్, శ్రీదేవి దంపతులను పలువురు సన్మానించారు. అనంతరం పాఠశాల ఆవరణలో రవీందర్ దంపతులు మొక్కలు నాటి, పాఠశాలకు టీవీ, బీరువాను బహూకరించారు. కార్యక్రమంలో 3వ డివిజన్ కార్పొరేటర్ జన్ను షీబారాణి, ఎంఈఓ అశోక్‌కుమార్, ఉపాధ్యాయులు పారిజాత, వెంకన్న, యూనియన్ల నాయకులు రవీందర్‌రెడ్డి, అబ్దుల్ గఫార్, శ్రీనివాసరెడ్డి, రహమద్బి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పాలన దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. అనంతరం జరిగిన సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమారాణి, దేవమ్మ, పున్నంచందర్, శ్రీకాంత్, రేవంతి, కిషన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఫర్టిలైజర్ డీలర్ల అభ్యున్నతికి కృషి చేస్తా



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

ఖిలా వరంగల్: ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ సభ్యుల అభ్యున్నతి కృషి చేస్తానని అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు అన్నారు. వరంగల్ శివనగర్‌లోని అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ఎన్నికల అథారిటీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, సభ్యులు సదానందం, వెంకట్రావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం శుక్రవారం జరిగింది. అధ్యక్ష, కార్యదర్శి నాగుర్ల వెంకటేశ్వర్లు, గొరిశెట్టి నాగరాజు, కోశాధికారి బొద్దిరెడ్డి నరసింహరెడ్డి, సభ్యులతో ఎన్నికల అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకోవాలి

హన్మకొండ అర్బన్: ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉంటూ ప్రతిఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని చింతగట్టు మహర్షి గోశాల స్థాపకుడు సర్జన్ రమేష్ గురూజీ అన్నారు. నగరంలోని ఎక్సైజ్ కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన రికార్డ్ మిల్లెట్ హబ్ చిరుధాన్యాల ఉత్పత్తి, విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మిల్లెట్ కుకింగ్ నిపుణులు కుసుమ కవిత, మిల్లెట్ కల్టివేటర్ కుసుమ - సురేష్ దంపతులు మాట్లాడుతూ పదిమందికి మంచి ఆహారాన్ని అందించాలన్న తపనతో ఈ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. విక్రయశాలలో సుమారు 150 రకాల వివిధ రకాల చిరుధాన్యాల ఉత్పత్తుల లభ్యమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో మిల్లెట్ ప్రమోటర్ నిమ్మల శ్రీనివాస్, ఎక్సైజ్ కాలనీ అసోసియేషన్ బాధ్యులు, శ్రీ హర్షిత, శ్రీవత్సవ్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రమేష్ గురూజీ

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

న్యూశాయంపేట: కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ కార్మిక సంఘాలు మే 20న అఖిల భారత సమ్మెకు పిలుపునిచ్చాయని, ఈమేరకు సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే.వెంకటేష్ కోరారు. హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో వెంకటేష్ మాట్లాడారు. రాష్ట్రంలో లేబర్‌కోడ్‌ల అమలును వెనక్కి తీసుకోవాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ ఈనెల 6నుంచి 14వ తేదీ వరకు జరగనున్న సామాజిక వారోత్సవాలను జయప్రదం చేయాలని, మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు. చక్రపాణి, రవి, రజిత, శ్వేత, వాణి, జమున, సమ్మక్క, రవికుమార్, రాంచందర్, బాబు, కళావతి, మహేష్, శోభ, మల్లేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

నేడు కేయూలో జగ్జీవన్‌రామ్ జయంతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 5న ఉదయం కేయూ దూరవిద్య కేంద్రం ఆవరణలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎ.రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

24న పీపీటీ ప్రవేశ పరీక్ష

విద్యారణ్యపురి: టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యాన పీపుల్స్ ప్రోగ్రెస్ టెస్టు(పీపీటీ) ప్రవేశ పరీక్ష ఈనెల 24న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సంఘం రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ శుక్రవారం హనుమకొండలోని యూనియన్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆవిష్కరించారు.

నిబంధనలు పాటించాలి

వరంగల్: ఇంటర్ మూల్యాంకనంలో బోర్డు నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఇంటర్ బోర్డు పరిశీలకుడు యాదగిరి సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, వరంగల్ క్యాంపు అధికారి డాక్టర్ శ్రీధర్‌సుమన్‌తో కలిసి శుక్రవారం వరంగల్ ఎల్‌బీ కళాశాల ఆడిటోరియంలో మూల్యాంకన సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

చెత్త సమస్యకు చెక్ పెట్టండి

వరంగల్ అర్బన్: హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ డంపింగ్ యార్డు తరహాలో వరంగల్ రాంపూర్ డంపింగ్ యార్డ్ చెత్త వ్యర్థాలను ప్రక్షాళన చేయాలని నగర మేయర్ సుధారాణి ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఇంజినీర్లు, ప్రజారోగ్యం ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాన్ని మేయర్ శుక్రవారం నిర్వహించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ)లో భాగంగా ఎస్‌టీపీలను ఏర్పాటు చేయాలని, అందుకోసం వెంటనే స్థలాలను ఎంపిక చేయాలని మేయర్, కమిషనర్ సుధారాణి, అశ్విని తానాజీ వాడకే సూచించారు.

రోడ్డుపై మిర్చి అమ్మకాలను అరికట్టాలి

వరంగల్: ఏనుమాముల మార్కెట్ సమీపంలోని ప్రధాన రహదారిపై ఇష్టానుసారంగా ఎండు మిర్చి అమ్మకాలను అరికట్టాలని ఆటో యూనియన్ అధ్యక్షుడు సలీం డిమాండ్ చేశారు. ఆటోస్టాండ్ స్థలంలో చిల్లర మిర్చి అమ్మకాలను నిలిపివేసి తమకు న్యాయం చేయాలని ఏనుమాముల పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌కు లిఖిత పూర్వకంగా శుక్రవారం ఫిర్యాదు చేశారు.

కాశిబుగ్గ చౌరస్తాలో చలివేంద్రం ప్రారంభం

వరంగల్: వరంగల్ కాశిబుగ్గ చౌరస్తాలో లక్ష్మీ గణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాశిబుగ్గ వర్తక సంఘం అధ్యక్షుడు గుండేటి కృష్ణమూర్తి, 19, 20వ డివిజన్ల కార్పొరేటర్లు ఓని స్వర్ణలత, గుండేటి నరేంద్రకుమార్ శుక్రవారం ప్రారంభించారు.

పాఠశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ఎల్లాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఎస్సార్ ఎన్‌ఎస్‌ఎస్ వేసవి ప్రత్యేక శిబిరంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులతో పాటు స్థానికులకు కంటి పరీక్షలు చేశారు.

సీతారామచంద్ర స్వామి కల్యాణానికి ఏర్పాట్లు

వరంగల్: శ్రీరామ నవమిని పురస్కరించుకొని వరంగల్ 18వ డివిజన్ లేబర్‌కాలనీ చెన్నారెడ్డి కాలనీలోని పంచముఖ నాగ వీరేశ్వరాలయంలో సీతారామచంద్ర స్వాముల కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మామిడాల రమేష్‌బాబు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు శివశ్రీ భోగేశ్వరశాస్త్రి, ఆలయ ధర్మకర్త ఆరుగొండ భూదేవి, సహాయ అర్చకులు కిరణ్‌శాస్త్రి గారు, రాజేందర్, సతీష్, లక్ష్మయ్య, సురేందర్, వేణు, సంపత్, రమేష్, భిక్షపతి, మోహన్, రాజేష్ పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

కాజీపేట: కాజీపేట రైల్వే దేవాలయాల సముదాయంలోని సీతారామస్వామి దేవాలయంలోని సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులను పట్టణ పుర వీధుల్లో ప్రత్యేక వాహనంపై భక్తులు శుక్రవారం ఊరేగించారు. ఉత్సవ విగ్రహాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి విష్ణుపురి, సోమిడి, రహమత్‌నగర్, బాపూజీనగర్, రైల్వేక్వార్టర్స్ మీదుగా ఊరేగించారు.

హిందూ ర్యాలీ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కాజీపేట: శ్రీరామనవమి హిందూ విజయ యాత్ర (ద్విచక్ర వాహన ర్యాలీ) వాల్‌పోస్టర్లను హిందూ సేవా సమితి కార్యకర్తలు కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 6న సాయంత్రం 4 గంటలకు కడిపికొండ బ్రిడ్జి నుంచి యాత్ర ప్రారంభమవుతుందని జిల్లా అధ్యక్షుడు నాగపురి వెంకటేష్ గౌడ్ తెలిపారు. సుబేదారి, హనుమకొండ చౌరస్తా, పోచమ్మ మైదాన్ మీదుగా దుర్గేశ్వర స్వామి దేవాలయం వరకు ర్యాలీ కొనసాగుతుందని అన్నారు.

ఆనంద భాష్పాంజనేయ ఆలయంలో పూజలు

రామన్నపేట: నగరంలోని పోచమ్మమైదాన్ సమీపంలో ఆనంద భాష్పాంజనేయ దేవస్థానాన్ని ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య ఆధ్వర్యంలో దత్త విజయానంద తీర్థ స్వామిజీ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి ఏకశనీశ్వర స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో బస్వరాజు శిరీష, శ్రీమాన్, గుండేటి నరేందర్, సోమరాజు సుధాకర్, గోరంటల రాజు, కరాటే ప్రభాకర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అంజన్న ఆలయంలో కుంకుమార్చన

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని దక్షిణ ముఖ అభయాంజనేయ స్వామి దేవాలయంలో మహిళలతో సామూహిక కుంకుమార్చన పూజలు శుక్రవారం నిర్వహించారు. సీతారామచంద్ర స్వామి నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజ చేయించారు. భక్తులతో కలిసి అర్చకులు విష్ణు సహస్రనామ పారాయణం, సుందరకాండ పురాణ ప్రవచనం చేశారు. దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీతారామచంద్ర ఆలయ కమిటీ ఏర్పాటు

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని సీతారామచంద్ర స్వామి ఆలయ (మెట్టుగుట్ట) ఉత్సవ కమిటీని దేవాదాయ ధర్మదాయ శాఖ శుక్రవారం ప్రకటించింది. ఉత్సవ కమిటీ సభ్యులుగా పల్లపు అర్జున్, హన్మకొండ మల్లికార్జున్, బిల్ల రాజ్‌కుమార్, మునిగాల రాము, మండల రఘు, జిట్ట హన్మంతరావు, దండిగం రమాదేవి, వలబోజు ఉపేందర్, గుగులోతు నాగేశ్వర్‌రావు, ముంజ రమేష్, నర్ర వెంకటేష్, గంగారపు రమేష్, మండల సంపత్‌ను ప్రకటించినట్లు ఒక ప్రకటనలో పేర్కొంది.

ప్రెస్‌క్లబ్ ఎన్నికలు నిర్వహించాలి

నయీంనగర్: కాల పరిమితి ముగిసిన గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఎన్నికలను వెంటనే నిర్వహించాలని వరంగల్ టీయూడబ్ల్యూజే (143) ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో యూనియన్ నేతలంతా ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్.లెనిన్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి రాజ్‌కుమార్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్, .వేణుగోపాల్, యూనియన్ నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రామన్నపేట: గత మార్చి 2న ఎంజీఎం ఆస్పత్రి ఆవరణలో స్పృహ లేకుండా పడిఉన్న వ్యక్తిని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మార్చి 6న మరణించాడని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. సదరు వ్యక్తి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు వివరించారు. వివరాలకు 87126 85005, 87126 85091 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.